పోలీసుల సేవలు ఎన్నటికీ మరువం : కలెక్టర్

● ఘనంగా అమర వీరుల దినోత్సవం



పోలీసు అమరవీరుల స్తూపానికి మొక్కుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కుటుంబాలను, వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి ప్రజల కోసం ఉద్యోగ నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల సేవలను ఎన్నటికీ మరువలేమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. ఎలాంటి కఠిన పరిస్థితుల్లోనైనా ప్రజల భద్రత కోసం విధులు నిర్వహించే క్రమంలో ప్రాణ త్యాగాలకైనా వెనుకాడని పోలీసుల నిస్వార్థ సేవలకు సెల్యూట్ చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి అమర వీరుల స్తూపం వద్ద జ్యోతి వెలిగించారు. పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. శోక్ శస్త్ర పరేడ్ నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అమరవీరుల కుటుంబాల వారిని పలకరించి మేమున్నామంటూ ధైర్యం చెప్పారు. వారిని సత్కరించి జ్ఞాపికలను అందించారు.

కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణే విధిగా పనిచేసే పోలీసులను గౌరవించి సహకరించడం ఎంతో అవసరమన్నారు. అమరులైన పోలీసు కుటుంబాల వారు పోలీసు కుటుంబాల్లో సభ్యులేనని, పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎస్పీ భరోసానిచ్చారు. ప్రజల సురక్షిత జీవితాల కోసం, శాంతి భద్రతల రక్షణ కోసం పోలీసు అధికారులు, సిబ్బంది ఎందరో తమ ప్రాణాలను పణంగా పెట్టారని అలాంటి వారిని స్మరించుకోవడం ఎంతైనా అవసరమని స్పష్టం చేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని పోలీసులు పనిచేయాలన్నారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ కరుణాకర్, జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అమరవీరుల కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు

ఎస్పీఎం ఉద్యోగ రథం ప్రారంభం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ఎస్పీఎం, భారతీయ యువశక్తి ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగ ప్రచార రథాన్ని ప్రారంభించారు. 18-30 సంవత్సరాల వయసున్న యువతీ యువకులకు జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు సహకారం అందజేస్తామని తెలిపారు. ఎస్పీఎం జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి, సీఎస్ఆర్ మేనేజర్ రీన బిల్వాల్, సుభాష్, ప్రవీణ్, జ్యోతి, కునాల్, శివాని, శంకర్, రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ రథాన్ని ప్రారంభిస్తున్న ఎంఎస్ గిరి తదితరులు

అవినీతి మత్తు.. ఆదాయం చిత్తు


● ఆబ్కారీ అధికారుల వసూళ్ల పర్వం

ఈటీవీ ఆదిలాబాద్

◆ బేల మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) మద్యం గొలుసు దుకాణం కోసం వేలం నిర్వహించింది. ఏడాదికి రూ. 12 లక్షలతో ఓ వ్యక్తికి దుకాణం దక్కింది. ఈ విషయం తెలిసిన ఓ ఆబ్కారీ అధికారి అక్కడికి వెళ్లారు. తనకు ఏడాదికి రూ.2 లక్షలు ఇవ్వాలని షరతు పెడితే గ్రామస్థులు అంగీకరించలేదు. చివరికి ఆదిలాబాద్‌లోని మద్యం సిండికేట్‌కు చెందిన ఓ ప్రముఖుడి వద్దకు వెళ్లటంతో నెలకు రూ.3 వేల చొప్పున ఏడాదికి రూ.36 వేలు అధికారికి ఇచ్చేలా ఒప్పందం కుదిరింది.



ఇది బోథ్ మండలంలోని ఓ మద్యం గొలుసు దుకాణం. ఇంద్రవెల్లి, ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో కొంతమంది అధికారుల కనుసన్నల్లో గొలుసుకట్టు దుకాణాల నిర్వహణ సాగుతోంది. డబ్బులు ఇవ్వటం ఆలస్యమైతే గుడుంబా, గంజాయి కేసులు నమోదు చేస్తామని భయపెడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఒకటి, రెండుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా స్పందన లేదు.



ఉమ్మడి జిల్లాలో 192 మద్యం దుకాణాలతోపాటు మరో 36 బార్ అండ్ రెస్టారెంట్లకు ప్రభుత్వ అనుమతి ఉంది. 12 మున్సిపాలిటీల పరిధిలో అనుమతులున్న దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను మినహాయిస్తే 1,519 పంచాయతీల పరిధిలో అక్రమ మద్యం దుకాణాలను అధికారులు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. గ్రామానికి ఒక్కో గొలుసుకట్టు దుకాణాల ద్వారా సగటున నెలకు రూ.5 వేల చొప్పున పరిగణనలోకి తీసుకుంటే నెలకు రూ.75.95 లక్షలు, రెండు దుకాణాలను పరిగణనలోకి తీసుకుంటే రూ.1.50 కోట్లు అక్రమ వసూళ్లే లక్ష్యంగా అధికారుల దందా కొనసాగుతోంది. కింది స్థాయి అధికారులు చేసే దందా ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతుందనే ఆరోపణలున్నాయి.

నిర్మల్ జిల్లా బేల్‌తరోడ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు మహారాష్ట్ర నుంచి వచ్చే అక్రమ మద్యం సరఫరాకు వారధిగా నిలుస్తోంది. మహారాష్ట్రలో ఎన్నికలు ఉన్నందున మన మద్యాన్ని అక్కడికి పంపిస్తూ అక్కడి చౌక మద్యాన్ని మనకు చేరవేసే దందా సాగుతోంది. కొంతమంది ఎంవీఐ అధికారులైతే రాష్ట్రంలోని ఒకరిద్దరు ప్రముఖ నేతల మద్దతు ఉందని చెబుతూ మహారాష్ట్రలోని బోకర్, పాలజ్, ధర్మాబాద్ మీదుగా అడ్డదారులు చూపుతున్నారు. ఫలితంగా మహారాష్ట్ర మద్యంతో మన రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుండగా, వ్యక్తిగతంగా ఎంవీఐ, ఆబ్కారీ అధికారులకు ఆదాయం చేకూరుతోంది.



ఇది మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీసులు పట్టుకున్న రూ.3 లక్షలు విలువ చేసే అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం. ఓ బొలెరో, మరో ఆటోలో మహారాష్ట్రకు తరలిస్తుండగా పారుపెల్లి సమీపంలో పోలీసులు సీజ్ చేశారు. అకీరా, ఆసరవెల్లి, మొట్లగూడెం, కోటపల్లి, వేమనపల్లి మీదుగా మద్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొంతమంది ఆబ్కారీ అధికారులు వ్యక్తిగత లాభాపేక్షతో పని చేస్తుండటం అక్రమాలకు తావిస్తోంది.





బాలిక శైలజను అభినందిస్తున్న డీటీడీవో రమాదేవి, అధికారులు

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణికి కాంస్యం

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్‌జోన్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి సత్తా చాటారు. ఆసిఫాబాద్‌లోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడా పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఆలం శైలజ అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించినట్లు గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయులు జంగు సోమవారం తెలిపారు. శైలజ, శిక్షకుడు విద్యాసాగర్‌లను డీటీడీవో ఆర్.రమాదేవి, సీఎంవో పి.ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొట్నాక విజయ్‌కుమార్, సట్ల శంకర్, క్రీడా శిక్షకులు లక్ష్మణ్, అరవింద్, తిరుమల్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

సమస్యల వెల్లువ.. సత్వర స్పందన

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఆయా శాఖల అధికారులను సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారం దిశగా కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల చర్యలు చేపడుతున్నారు.

◆ సోమవారం మండలంలోని బోరిగాం శివారు సర్వే నం.137లో మారుతీ అనే వ్యక్తికి 1997లో ప్రభుత్వం కేటాయించిన స్థలానికి ఎన్‌ఓసీ కోసం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఇవ్వడంలేదని షాకిర్ మహ్మద్ దరఖాస్తు చేశారు.



ఎన్‌ఓసీ కోరుతూ షాకిర్ అహ్మద్ ఇచ్చిన దరఖాస్తును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్ల



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు పాలనాధికారి దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

స్పందించిన సబ్ కలెక్టర్ విచారణ చేపట్టి మంగళవారం ఎన్‌ఓసీ జారీ చేయాలని ఆదేశించారు. రాస్పెల్లికి చెందిన లావుడె సంగీత తన ఎకరం భూమికి చెందిన పట్టాపాస్ పుస్తకంలో అక్షరదోషాల కారణంగా రైతుబంధు పొందలేకపోతున్నామని, మీ-సేవలో దరఖాస్తు చేసుకుని రెండు నెలలు గడుస్తున్నా సవరణ చేయడంలేదని.. తన భర్త మహ్మద్ ఇసాక్ కలిసి దరఖాస్తు చేశారు. వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ అక్షరదోషాలు సరిచేయాలని అధికారులను ఆదేశించారు.

◆ కాగజ్‌నగర్‌లోని రెండు పడక గదుల ఇళ్లను గతంలో నిర్వహించిన లక్కీడ్రాలో ఎంపికైన వారికి కేటాయించాలని కోరుతూ.. పలువురు లబ్ధిదారులు వినతిపత్రం ఇచ్చారు. ఒంటిరిగా వైకల్యంతో బాధపడుతున్న తనకు రేషన్‌కార్డు, పింఛన్ సౌకర్యం లేదని, జీవనోపాధి కల్పించాలని కోరుతూ.. కాగజ్‌నగర్‌కు చెందిన సరోజ దరఖాస్తు చేసుకున్నారు.

◆ భూ వివాదాలపై 8, రేషన్‌కార్డుల కోసం 3, పింఛన్ల కోసం 5, ఇతర సమస్యలపై 7, మొత్తం 23 దరఖాస్తులు స్వీకరించినట్లు సబ్ కలెక్టర్ వెల్లడించారు. దరఖాస్తులను పరిశీలించి విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆసిఫాబాద్‌లో.. 46

ఆసిఫాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా అదనపు పాలనాధికారి దాసరి వేణు అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్‌నగర్ మండల మాలిని గ్రామానికి చెందిన నైతం పరమేశ్ తనకు ఆర్‌వోఎఫ్ఆర్ కింద పట్టా పాసు పుస్తకం ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేశారు. దహెగాం మండలం రాంపూర్‌కు చెందిన గిరిజనులు తమకు గిరి వికాస్ పథకం కింద బోరుబావులు తవ్వించారని, విద్యుత్తు సరఫరా కల్పించి మోటారు పంపులు బిగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెజ్జూరు మండలం మర్తిడికి చెందిన దాగం శంకర్‌బాయి తనకు ఒంటరి మహిళ ఆసరా పింఛను మంజూరు చేయాలని కోరారు. ఆసిఫాబాద్ మండలం ఈదులవాడకు చెందిన యువకులు తమ గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్‌కు చెందిన కొండగుర్ల చంద్రశేఖర్ ఔట్‌సోర్సింగ్ పోస్టులను అన్ని ఏజెన్సీలకు సమానంగా కేటాయించాలని దరఖాస్తు చేశారు. కౌటాల మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర స్వయం సహాయక సంఘం ప్రతినిధులు తమ గ్రామంలో రేషన్ డీలర్‌ను నియమించాలని విన్నవించారు. రెబ్బెన మండలం రాంపూర్‌కు చెందిన చాపిడి ప్రేమ్‌కుమార్ తన కుటుంబానికి ఉపాధి హామీ జాబ్ కార్డు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ప్రజావాణిలో 46 దరఖాస్తులు స్వీకరించామని, వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

ఆర్‌బీఎస్‌కే పరీక్షలు.. 96శాతం పూర్తి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు వైద్యారోగ్యశాఖ, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. సాధారణంగా పిల్లల్లో కనిపించే స్వల్ప అనారోగ్య లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధులుగా మారకుండా బదులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పరీక్షలు నిర్వహించి వైద్యం అందించడం ఆర్‌బీఎస్‌కే లక్ష్యం. పిల్లలకు ఆరోగ్యంపై సరైన అవగాహన లేకపోవడంతో వివిధ రకాల రుగ్మతలు చుట్టుముడతాయి. వాటి నుంచి రక్షణ కల్పించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జబ్బులను గుర్తించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తారు. మెరుగైన వైద్యం అవసరం ఉంటే ఉస్మానియా, గాంధీ తదితర ఆసుపత్రులకు తరలిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 96.25 శాతం పరీక్షలు నిర్వహించారు.

● విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం..



కాగజ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు అన్నపూర్ణ, శ్రీకాంత్

జిల్లా వివరాలు..

	జిల్లా లక్ష్యం	పూర్తయింది	శాతం	చికిత్స పొందిన వారు	రెఫర్ చేసిన వారు
ఏప్రిల్	17,755	17,105	96.34	1380	264
మే	13,636	12,910	94.68	1200	119
జూన్	15,299	14,730	96.28	1236	297
జులై	17,111	16,387	95.77	2493	768
ఆగస్టు	19,101	18,358	96.11	3942	731
సెప్టెంబరు	18,200	17,820	97.91	3247	651
మొత్తం	1,01,102	97,310	96.25	13,498	2,830

ప్రభుత్వ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లేందుకు జిల్లా వ్యాప్తంగా ఆర్‌బీఎస్‌కేకు చెందిన పది బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఇద్దరు వైద్యులు, ఒక ఫార్మసిస్టు, ఒక ఏఎన్ఎం ఉంటారు. కాగజ్‌నగర్, దహెగాం, ఈజ్‌గాం, సిర్పూర్ (టి), తిర్యాణి, రెబ్బెన, ఆసిఫాబాద్, కెరమెరి మండలాల కేంద్రంగా ప్రత్యేక వాహనాలు కేటాయించారు. వీరు క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు, సలహాలు, సూచనలు అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలకు ఏడాదికోసారి, అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదిలో రెండు సార్లు వైద్య బృందం వెళ్తుంది. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇస్తారు. వారి తల్లిదండ్రులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

డా.సీతారాం, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్



విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఆరోగ్య పరీక్షల్లో పిల్లల లోపాలను గుర్తించి వారికి వైద్య సేవలు అందిస్తాం. వారికి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా అవగాహన కల్పిస్తున్నాం. పరీక్షలు నిర్వహించి అక్కడికక్కడే వైద్యం, మందులు అందజేస్తున్నాం. అవసరమున్న వారిని మెరుగైన ఆసుపత్రులకు తరలిస్తున్నాం. వైద్యారోగ్యశాఖ అందజేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

మీ నిర్లక్ష్యం.. మా పాలిట శాపం!



రోడ్డు పక్కన చెత్తను తింటున్న పశువులు

సిర్పూర్(టి) గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ, తరలింపు సక్రమంగా జరగడం లేదు. నిత్యం తీసుకువెళ్లే వారు రాకపోవడంతో ప్రజలు చెత్తను రోడ్లపై పడేస్తున్నారు. మరోవైపు ట్రాక్టర్‌లో చెత్తను సేకరించి స్థానిక కస్తూర్బా విద్యాలయం వెనకాల ఉన్న డంపింగ్ యార్డులో తరలించాల్సి ఉన్నా.. రహదారుల పక్కన, ఎక్కడ పడితే అక్కడే కుప్పలుగా పడేస్తున్నారు. దీంతో పలు రహదారులు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. వాటిని పశువులు తింటుండటంతో రోగాలబారిన పడుతున్నాయి. సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న సిర్పూర్ బ్రిడ్జి వద్ద చెత్తను పడేస్తున్నారు. ఈ మార్గం దుర్గంధభరితంగా మారింది. డంపింగ్ యార్డులో ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని కోరుతున్నారు.



సిర్పూర్ బ్రిడ్జి వద్ద చెత్తాచెదారం

\- న్యూస్‌టుడే, సిర్పూర్(టి)

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి 30 వరకు గడువు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో 2024-25 విద్యాసంవత్సరంలో ఈ నెల 30వ తేదీ వరకు ప్రవేశాలు పొందవచ్చని కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, కో-ఆర్డినేటర్ తూదూరు దత్తాత్రేయ తెలిపారు. ఓపెన్ డిగ్రీ చేయాలన్న ఆసక్తి కలిగి ఇంటర్, సమాన విద్యార్హతగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సైతం ఈ నెల 30లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.



సర్వే ముమ్మరం.. సమస్యలు అనేకం!

● ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన


ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

అక్రమ వెంచర్లు, అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను అమల్లోకి తెచ్చి దరఖాస్తులు స్వీకరించింది. పరిశీలన లేక అప్పట్లో మూలకు చేరింది. కాంగ్రెస్ ప్రభుత్వం వీటి క్రమబద్ధీకరణకు నిర్ణయం తీసుకుంది. అధికారులు క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల పరిశీలన ముమ్మరం చేశారు.

జిల్లాలోని 335 పంచాయతీలు, రెండు పురపాలికల పరిధిలో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం 7,698 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీల పరిధిలో.. పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులు, పురపాలిక పరిధిలో.. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో సంయుక్తంగా పరిశీలిస్తున్నారు. వీటిలో సవ్యంగా ఉన్న వారికి ఫీజు చెల్లింపునకు నోటీసులు జారీ చేస్తున్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములు, చెరువులు, ప్రాజెక్టుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నవి, స్థానిక అవసరాలకు కేటాయించి ఉంటే, వక్ఫ్‌బోర్డు ఆస్తులకు అనుమతులు ఇవ్వరు.

దశల వారీగా..

జిల్లాలో ఎల్-1, 2, 3 మూడు దశల్లో పంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐలు, నీటిపారుదలశాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు. అన్ని సవ్యంగా ఉన్న వాటిని ఎల్-2 లాగిన్‌కు పంపిస్తారు. సరైన పత్రాలు లేకుంటే షార్ట్‌ఫాల్‌లో, నిషేధిత భూములు, జలాశయాల శిఖంలో ఉంటే రిజెక్టులో నమోదు చేస్తున్నారు. ఎల్-2 స్థాయిలో పంచాయతీల పరిధిలో డీపీవో, పురపాలికల పరిధిలో సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలిస్తారు. ఇక్కడ సవ్యంగా ఉన్న వాటిని ఫీజు చెల్లింపు కోసం సంబంధిత దరఖాస్తుదారునికి ఎస్ఎంఎస్ రూపంలో సందేశం పంపిస్తారు. ఫీజు చెల్లించాక.. ఎల్-3 లాగిన్‌కు వెళ్తుంది. అక్కడ అదనపు కలెక్టర్ పరిశీలించి కలెక్టర్ ఆమోదానికి పంపిస్తారు. తద్వారా క్రమబద్ధీకరణ జరుగుతుంది.





సర్వే పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల

ప్రస్తుత పరిస్థితి ..

ఆసిఫాబాద్ పుర పరిధిలో 1649 దరఖాస్తులు రాగా.. 105 పరిశీలించారు. ఇందులో 97 మందికి ఫీజు చెల్లింపునకు ఆమోదించారు. కాగజ్‌నగర్ పుర పరిధిలోని 1870 దరఖాస్తులలో.. 1807 పరిశీలన పూర్తయింది. వీరిలో 170 మందికి ఫీజు చెల్లించేందుకు ఆమోదించగా.. 29 మంది చెల్లించారు. పంచాయతీల పరిధిలో 4,179 దరఖాస్తులలో 2,342 పరిశీలించారు. వీటిలో ఎన్ని సవ్యంగా ఉన్నాయి, పత్రాలు ఇవ్వని వారెందరు, తిరస్కరించినవి ఎన్ని తదితర వివరాలను చెప్పేందుకు నిరాకరిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో భిన్నంగా..

సర్వే సమయంలో సిబ్బంది వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొందరు అయిదారు సార్లు ఫోన్ చేస్తే కానీ రావడంలేదని, వేరే వారికి ప్లాట్లు విక్రయించిన వారిలో కొందరు ఫోన్ చేసినా స్పందించడంలేదని చెబుతున్నారు. కొందరు పూర్తి స్థాయిలో పత్రాలు జతపర్చకపోవంతో ప్లాట్ల గుర్తింపు కష్టంగా మారుతోంది నెలాఖరు వరకు సర్వే పూర్తి చేయాలన్న అధికారుల ఆదేశం.. క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు కనిపిస్తుండడంతో సర్వే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

సెనగ సాగుకు అనుకూలం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : జిల్లా భూములు యాసంగిలో సెనగ సాగుకు లాభదాయకంగా ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు పొందే వీలుందని అన్నారు. వానాకాలంలో సోయా సాగు చేసిన రైతులు రెండో పంటగా సెనగ సాగు చేసుకుంటే మేలు. ఈ పంట చల్లని వాతావరణంలో పెరుగుతుందని ఆయన తెలిపారు.

ఇలా విత్తుకోవాలి..

ఎకరానికి 20 నుంచి 25 కిలోల విత్తనం అవసరం. ఆలస్యంగా వేసినట్లయితే మరో 20 శాతం అదనంగా వేసుకోవాలి. ఎండుతెగులు ఉంటే విత్తనశుద్ధి చేసుకోవాలి. కిలో విత్తనానికి నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా వాడితే మంచి ఫలితం ఉంటుంది. విత్తిన తర్వాత పెండిమిథాలిన్ ఎకరాకు 1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 25 రోజులకు గొర్రుతో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. విత్తిన 20 రోజులకు ఒకసారి తిరిగి 30-40 రోజులలో రెండో సారి కలుపుతీయాలి.



సెనగ పచ్చ పురుగు

రైతేరాజు

ఎరువులు ఇలా..

నేల స్వభావాన్ని బట్టి నేలలో లభించే పోషకాల మోతాదును బట్టి ఎరువు వాడాలి. చివరి దుక్కిలో ఎకరానికి రెండు టన్నుల పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. ఎకరా సెనగ సాగుకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. నేలలో నిల్వలు సరిపడా ఉన్నప్పుడు భాస్వరం, పొటాష్ ఎరువులు వేసే అవసరం లేదు. ఈ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. ఎకరాకు 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా 50 కిలోల డీఏపీని వేసినచో పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం అందుతాయి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో వేసిన పంటకు కావాల్సిన గంధకము కూడా అందుతుంది.



సస్యరక్షణ

పంటను పచ్చపురుగు ఆశించి నష్టపరుస్తుంది. ఇది విత్తనాలు మొలిచిన 10-15 రోజుల నుండి ఆశించి పంట పరిపక్వదశకు చేరే వరకు ఉండి విపరీతమైన నష్టాన్ని కలిగిస్తుంది. నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. వేపకషాయాన్ని పిచికారీ చేయాలి.

విత్తనోత్పత్తి

విత్తనోత్పత్తిగా సాగు చేసే రైతులు సారవంతమైన, మురుగు నీరు నిలవని గత పంట కాలంలో సెనగ పంటను వేయని పొలాన్ని విత్తనోత్పత్తికి ఎన్నుకోవాలి. ఇతర సెనగ పంట పొలాల నుంచి కనీసం 5 మీటర్ల దూరంలో ఉండేలా చూసుకోవాలి. అక్టోబరు - నవంబరు 15లోగా విత్తనాలు విత్తుకోవడానికి అనుకూల సమయం. ఆయా ప్రాంతానికి అనువైన, తెగుళ్లను తట్టుకొని, అధిక దిగుబడిని ఇచ్చే రకాలను ఎన్నుకొని మూల విత్తనాన్ని అధీకృత సంస్థల నుంచి సేకరించి విత్తనోత్పత్తికి వాడాలి. విత్తిన 30-40 రోజుల సమయంలో తేలికపాటి తడి ఇస్తే దిగుబడి పెరిగి నాణ్యమైన విత్తనం లభించే వీలుంది.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



డా. శివకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి
చరవాణి సంఖ్య: 91002 29854

? ప్రస్తుతం కందిని మచ్చల పురుగు ఆశిస్తోంది. నివారణ చర్యలు తెలపండి? - సత్యనారాయణ, రైతు, తపాల్‌పూర్

✓ మచ్చల పురుగు నివారణకు 2.5 మిల్లీ లీటర్ల క్లోరోపైరిఫాస్ లేదా 0.75 మిల్లీలీటర్ల నోవాల్యురాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4మి.లీ. లేదా ఫ్లూబెండామైడ్ 0.2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

? యాసంగిలో వేయదగిన ఆరుతడి పంటలు ఏవి? -వెంకటేష్, రైతు, కాసిపేట

✓ పంట మార్పిడి చేసే ఆరుతడి పంటలు వేయడం వల్ల నేల సారవంతంగా మారుతుంది. వేరుసెనగలో కదిరి-6, కదిరి-9, టీజీ-24 రకాలు వేసుకుంటే ఎకరానికి 8క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెసరలో ఎంజీటీ-295, డబ్ల్యూజీజీ-37, రకాలు 4 క్వింటాళ్లు, నువ్వులలో శ్వేత, హిమ, గౌరి రకాలు ఎకరాలకు 2.5 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది. ప్రస్తుత వానాకాలం పంట పూర్తి కాగానే వీటిని విత్తుకోవచ్చు.

పాడి.. లాభాలు దండి



స్వాతిరెడ్డి



కజ్జర్లలో ఏర్పాటు చేసిన డెయిరీ ఫాంలో గేదెలు

ఆదర్శం

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ఎంపిక చేసుకుని వాటిని నిత్య ఆదాయ మార్గాలుగా మార్చుకోవచ్చని నిరూపిస్తున్నారు తలమడుగు మండలం కజ్జర్లకు చెందిన మహిళా రైతు స్వాతిరెడ్డి. 2020లో కజ్జర్లలో తండ్రి స్వామిరెడ్డి ప్రోత్సాహంతో 20 ముర్రజాతి గేదెలతో సొంత స్థలంలో డెయిరీఫాం ఏర్పాటు చేసుకున్నారు. నిర్వహణకు ఇద్దరు కూలీలను నియమించారు. పొలంలోని 2 ఎకరాల స్థలంలో సూపర్ నేపియర్ గడ్డిని పెంచి ఏడాది పొడవునా గేదెలకు పచ్చి గడ్డి ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. పత్తిచెక్క, వరి తవుడు, పెసర చున్నీని దాణాగా పెడుతున్నారు. 2024 నాటికి మరో 30 గేదెలను కొని మొత్తం 50 గేదెలతో డెయిరీ ఫాం నిర్వహిస్తున్నారు. గేదెలు నిత్యం 150 లీటర్ల పాలు ఇస్తుండగా వాటిని ఆదిలాబాద్ పట్టణానికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రతి నెల రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తోంది. కూలీలు, డెయిరీ ఫాం నిర్వహణ ఖర్చులకు రూ.1 లక్ష పోగా.. రూ.2 లక్షల లాభం వస్తోందని ఆమె తెలిపారు. ప్రతి పంట కాలం మొదట్లో పేడ విక్రయం ద్వారా అదనంగా రూ.1 లక్ష ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం నలుగురు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. మార్కెట్‌లో పాల విక్రయం అధికంగా ఉండటంతో ఏటా గేదెలు కొనుగోలు చేస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడితే ఆశించిన లాభాలు వస్తాయంటున్నారు.

మొక్కజొన్నలు పశుగ్రాసంగా..

మీకు తెలుసా?

చాలా మంది రైతులు మొక్కజొన్న కంకులను ఎరువుగా, వంట చెరకుగా వాడుతున్నారు. ఈ కంకులలో మామూలు పశుగ్రాసాలలో ఉన్నట్లు 3-5 శాతం వరకు మాంసకృత్తులు, 55 శాతం పిండి పదార్థాలు ఉన్నాయి. ఈ కంకులను పశువులు నమిలి తినడం కష్టం. అందువల్ల వాటిని ఎండబెట్టి, యంత్రం ద్వారా పొడిగా చేసుకొని పశుగ్రాసాల కొరత సమయాలలో వాడుకోవచ్చు.

విద్యార్థి భవితవ్యానికి అపార్



న్యూస్‌టుడే, మంచిర్యాల విద్యావిభాగం :

జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ పేరిట ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు దేశంలోని ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఒక ప్రత్యేక ఐడీని అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కేటాయించనున్నారు. ఇది దేశంలో ప్రతి విద్యార్థికి అందించే గుర్తింపు నంబరు. ఆన్‌లైన్ నమోదుకు ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అన్ని జిల్లాల విద్యా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లా వ్యాప్తంగా 4822 ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాలు, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలు కొనసాగుతున్నాయి. 4 లక్షల మందికి పైగా విద్యార్థులు ఆయా మాధ్యమాల తరగతుల్లో చదువుతున్నారు. పిల్లలకు పాఠశాల స్థాయిలో చైల్డ్ ఇన్ఫో ద్వారా ఒక ఐడీ, కళాశాల స్థాయిలో మరో ఐడీ ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అందించే అపార్ కార్డులోనే పూర్తి సమాచారం ఉండనుంది. అపార్‌కార్డు ద్వారా కేటాయించే సంఖ్య జీవిత కాలం ఐడీగా పరిగణిస్తారు. ఇందులో విద్యార్థికి సంబంధించిన కేజీ టూ పీజీ వరకు విద్యార్థి పూర్వ వివరాలు, సాధించిన విజయాలు, ఉపకార వేతనాలు, మెమోలు, ధ్రువపత్రాలు ఆధార్ అనుసంధానం ఉండటంతో కుటుంబ వివరాలు అందుబాటులో ఉంటాయి.



అపార్ నమూనా కార్డు

అంగీకారం తప్పనిసరి

కేంద్ర ప్రభుత్వం జారీచేసే ఈ అపార్‌కార్డు వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయి. దీనిని పొందేందుకు తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్ర మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఇటీవల విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పించారు. గత శనివారం నిర్వహించిన పీటీఎం (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్)లో ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులతో దీని గురించి వివరించారు. పాఠశాలల్లో, ఆధార్ కార్డులో వివరాలు ఒకేలా ఉండాలని లేనివారు మార్పులు చేసుకోవాలని సూచించారు. తర్వాత మార్పులకు అవకాశం ఉండదని.. అపార్ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ అంగీకార పత్రాలపై అవగాహన కల్పించారు.

కార్డులో పొందుపర్చే అంశాలు

డిజిటల్ కార్డుపై విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటాయి.

ఉపయోగాలు

✦ విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

✦ అపార్ గుర్తింపుతో డిజీలాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యావిషయ విజయాలు, ధ్రువపత్రాలు డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చు.

✦ విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు, వివిధ విద్యాసంస్థల్లో చేరికలు, మార్పులు, ఉద్యోగాల భర్తీ సమయం ఇతర సందర్భాల్లో సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించేలా రూపొందించారు.

ఒకే ఐడీలో పూర్తి వివరాలు



కేంద్రం ప్రభుత్వం తీసుకొస్తున్న అపార్ కార్డు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనుంది. ఒకే నంబరులో విద్యార్థికి సంబంధించి పూర్తి వివరాలు నమోదుకానున్నాయి. దీనికి తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చాం. ఇటీవల తల్లిదండ్రుల సమావేశాల్లో సైతం వారికి వివరించాం.

- ఎస్.యాదయ్య, డీఈవో మంచిర్యాల

కంది మొక్క.. 12 అడుగులు

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్‌లో కోన ఓదెలు ఇంటి ఆవరణలో ఏపుగా ఎదిగిన కంది మొక్క ఇది. సాధారణంగా కంది మొక్క మూడు నుంచి ఆరు అడుగులు పెరగడం సాధారణం. అలాంటిది వారి ఇంటి ముందు ఉన్న మొక్క 12 అడుగుల మేర పెరిగింది. ఇంటికన్నా ఎక్కువ ఎత్తు పెరిగిన ఆ చెట్టును గ్రామస్థులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. దీనిపై బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఇస్లావత్ తిరుపతిను సంప్రదించగా విత్తనాల్లో జన్యుమార్పిడి కారణంగా ఒక్కోసారి మొక్క పెరుగుదల అసాధారణంగా ఉంటుందన్నారు. ఇదే మొక్క నుంచి సేకరించిన విత్తనాలు ఇదే స్థాయిలో ఎదగకపోవచ్చని ఆయన తెలిపారు.



ఏపుగా ఎదిగిన కంది మొక్క వద్ద ఇంటి యజమాని ఓదెలు

- న్యూస్‌టుడే, లక్షెట్టిపేట

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : మందమర్రి రెండో జోన్‌కు చెందిన జి.సత్యఅన్వేష్ (21) అనే విద్యార్థి విద్యుదాఘాతంతో సోమవారం మృత్యువాత పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న సత్యఅన్వేష్ సోమవారం సాయంత్రం ఇంట్లో స్నానం చేసి టవల్ తీగపై ఆరవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే మందమర్రి డిస్పెన్సరీకి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆర్కేపీ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మందమర్రి ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.



జి.సత్యఅన్వేష్

పతుల కోసం సతుల పూజలు

ఘనంగా కర్వాచౌత్ పండగ

రెబ్బెన, న్యూస్‌టుడే: సాధారణంగా ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో కర్వా చౌత్ పండగను కనులపండువగా నిర్వహిస్తుంటారు. ఏడాదికి ఒకసారి వచ్చే కార్తిక మాసంలోని కృష్ణపక్ష చతుర్థి రోజున ప్రత్యేకంగా వివాహితులైన మహిళలు మాత్రమే దీన్ని ఆచరిస్తుంటారు. ఆ రోజు సూర్యోదయానికి ముందు ఉపవాసం ప్రారంభించి రాత్రి చంద్రుని దర్శనం తర్వాత ముగిస్తారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు రెబ్బెన మండల కేంద్రంలో స్థిరనివాసం ఏర్పర్చుకున్న పలు కుటుంబాలు ఈ పండగను ఘనంగా కొనసాగిస్తుంటారు.

గ్రామీణ ప్రాంత మహిళలే కాకుండా పట్టణాల్లోని వారు కూడా కర్వా చౌత్ ఉపవాసాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పాటు ఉత్సాహంగా పాటిస్తుంటారు. శాస్త్రాల ప్రకారం కార్తిక మాసంలోని కృష్ణ పక్షంలో చంద్రోదయ చతుర్థి రోజున వ్రతాన్ని ఆచరించాలి. కార్తీక కృష్ణ పక్ష చతుర్థి రోజున కర్కచతుర్థి (కర్వా చౌత్) ఉపవాసం పాటించే సంప్రదాయం ఉంది. భర్తలు ఎల్లప్పుడు యోగక్షేమాలతోపాటు దీర్ఘాయువుగా ఉండాలనే ఉద్దేశంతో సతులు పండగను నిర్వహిస్తారు. ఉదయం 4 గంటల నుంచి ఉపవాసం తీసుకొని కనీసం నీళ్లు కూడా తాగకుండా రాత్రి చంద్రుని దర్శనం కోసం ఎదురు చూస్తారు. బాలచంద్ర గణేష్‌కు పూజలు చేసిన తర్వాత అందరూ కలిసి తులసి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రి జల్లెడలో చంద్రుడిని దర్శించుకుని ఆహారం తీసుకోవడంతో ఉపవాసం ముగుస్తుంది.



తులసి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

శెభాష్ సంజయ్

● మూడు మైనింగ్ ఉద్యోగాలకు ఎంపికైన మిట్టపల్లి యువకుడు

న్యూస్‌టుడే, జైపూర్ :

సాదాసీదా మధ్య తరగతి కుటుంబం వారిది. తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నప్పటికి కుటుంబం పెద్దది కావడంతో వారిని పోషించడంలో చాలా కష్టాలను ఎదుర్కొన్నాడు. తనలా తన కుమారుడు కావొద్దని.. తను పనిచేసిన సింగరేణి లోనే అధికారిగా పని చేయాలని ఆయన కలలు కన్నాడు. తండ్రి పడ్డ కష్టం.. తన మీద పెట్టుకున్న ఆశలు మరింత బాధ్యతను పెంచాయి. దీంతో పట్టుబట్టి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు ఎగ్జిక్యూటివ్ స్థాయి మైనింగ్ ఉద్యోగాలు సాధించి శెభాష్ అనిపించారు రామటెంకి సంజయ్‌కుమార్.

మిట్టపల్లి గ్రామానికి చెందిన రామటెంకి పోషం-రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికన్న చిన్నవాడు సంజయ్. తండ్రి చిన్నతనంలోనే సింగరేణిలో ఉద్యోగ విరమణ కావడం... ఆయన ప్రోత్సాహంతో భవిష్యత్తులో తాను సింగరేణి అధికారి కావాలనే లక్ష్యంగా పెట్టుకున్నాడు. దీంతో 2013 ఎంసెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కొత్తగూడెంలోని కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌లో ఉత్తమ మార్కులతో బీటెక్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో కొంతకాలం జెన్‌టీయూలో ఒప్పంద అధ్యాపకుడిగా కూడా పని చేశాడు. అదే క్రమంలో జీవితంలో మరింత సాధించాలనే తపనతో గేట్ పరీక్ష రాసి 2020లో ఐఐటీ ధన్‌బాద్‌లో మైనింగ్‌లో ఎంటెక్ చేసి కాలేజీలో మొదటి ర్యాంకు సాధించి బంగారు పతకం కూడా అందుకున్నాడు. 2022లో మహారత్న కంపెనీ అయిన కోల్ ఇండియాలో అండర్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం మహారాష్ట్రలోని వెస్ట్రన్ కోల్ ఫీల్డ్ వాణి నార్త్ ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇదే క్రమంలో 2023లో మరో మహారత్న కంపెనీ అయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ)లో ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగం వచ్చినప్పటికి అందులో చేరలేదు. ఈ ఏడాది జులైలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపి అండర్ మేనేజర్‌గా ముచ్చటగా మూడో ఉద్యోగం సాధించగా తల్లిదండ్రుల కోరిక మేరకు సింగరేణిలోనే ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని కోరుకుంటున్నాడు సంజయ్.



ఐఐటీ ధన్‌బాద్ డైరెక్టర్ రాజీవ్ శేఖర్ నుంచి బంగారు పతకం అందుకుంటున్న రామటెంకి సంజయ్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఏజెన్సీలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులు వారి సమస్యలను వివరించారు. ఉట్నూరు మండలం బోయవాడకు చెందిన శంకర్ తనకు ఉద్యోగం ఇప్పించాలని, కాసిపేట మండలం మాలకెపల్లికి చెందిన ఆత్రం శంకర్ తన ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్ మంజూరు చేయాలని కోరారు. ఇచ్చోడ మండలం జల్దాకు చెందిన గణేష్ కిరాణ దుకాణం కోసం రుణం మంజూరు చేయాలని, దహేగాం మండలం దేవులగూడకు చెందిన సోములాల్ తన భూమి పట్టా చేయాలని కోరారు. రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలతో కూడిన అర్జీలు పలువురు సమర్పించారు. ఏపీఓ వసంత్‌రావు, ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ కుడ్మెత మనోహర్, ఈఈ భీంరావు, ఏవో దామోదర్‌రావు, పీహెచ్‌ఓ సందీప్‌కుమార్, డీపీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

నవంబరు 5 నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉట్నూరు కుమురం భీం ప్రాంగణంలో నవంబరు 5 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. సోమవారం పోటీల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్రీడాకారులకు వసతి, అందించాల్సిన భోజన సౌకర్యాలపై చర్చించారు. అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవానికి అతిథుల ఆహ్వానపత్రాలు, విద్యుత్తు, వైద్యం, ఆట వస్తువులు సకాలంలో సిద్ధం చేయాలని సూచించారు. ఏపీవో వసంత్‌రావు, ఈఈ భీంరావు, ఉమ్మడి జిల్లాల క్రీడల అధికారులు పాల్గొన్నారు.

అన్నయ్య ప్రోత్సాహంతో



ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో అశోక్, వందన దంపతుల కూతురు నిఖిత. డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికయ్యారు. తన అన్నయ్య, ఉపాధ్యాయుడు మంద కిరణ్ అన్ని రకాలుగా ప్రోత్సహించారన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆన్‌లైన్ యాప్‌తో విలువైన సలహాలు తీసుకున్నామని తెలిపారు. ఇవి ఉద్యోగ సాధనకు ఎంతో ఉపకరించాయని పేర్కొన్నారు.

మేస్త్రీ పని చేస్తూ



నేరడిగొండకు చెందిన ఇ.గంగాధర్ తల్లిదండ్రులు గంగారాం, పోసాని బీడీ కార్మికులుగా పని చేస్తారు. ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్ సాయంతో డిగ్రీ, కష్టాలు పడుతూనే బీఈడీ పూర్తి చేశారు. వివాహం తర్వాత బతుకుదెరువు కోసం మేస్త్రీగా పని చేయాల్సి వచ్చింది. డీఎస్సీ కోసం బీసీ స్టడీ సర్కిల్‌లో చేరి స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు.

తల్లిదండ్రులు గర్వపడేలా



తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన నర్సమ్మ, శంకర్‌ల కూతురు జ్ఞాన ప్రగతి. చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేది. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో మూడో ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపిక కాగా, భాషా పండితురాలుగా ఆరో ర్యాంకు సాధించారు. క్రమం తప్పకుండా బీసీ స్టడీ సర్కిల్‌కు వెళ్లి తోటి విద్యార్థులతో కలిసి చదువుకున్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా ఉద్యోగం సాధించారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగాల సాధన

ప్రభుత్వ స్టడీ సర్కిళ్ల ద్వారా 77 మంది ఎంపిక

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్టడీ సర్కిళ్లు నిరుద్యోగులకు వరంగా మారాయి. ఉద్యోగాల సాధనకు అవసరమైన సదుపాయాలను ఉచితంగా కల్పిస్తున్నాయి. మెరుగైన వసతులుండటం, స్టడీ మెటీరియల్‌ను అందిస్తుండటంతో నిరుద్యోగ యువతలో మార్పు వస్తోంది. సివిల్స్, గ్రూప్స్‌వంటి ఉద్యోగాలతోపాటు అన్ని రకాల ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేందుకు శిక్షణ ఇస్తున్నారు. మరికొందరు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్టడీ హాళ్లలో సాధన చేస్తున్నారు. వాట్సప్, టెలీగ్రామ్ గ్రూపులను ఏర్పాటు చేసి అభ్యర్థులకు విద్య, ఉద్యోగరంగాలకు సంబంధించిన సమాచారం, ఉద్యోగ ప్రకటనలు చేరవేస్తున్నాయి.

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల్లో 77 మంది స్టడీ సర్కిళ్లలో సాధన చేసినవారే కావడం గమనార్హం. బీసీ స్టడీ సర్కిల్‌లో సాధన చేసిన వారిలో 51 మంది ఉద్యోగాలు సాధించారు. ఇందులో 34 మంది ఎస్జీటీలుకాగా 17 మంది స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొందారు. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారిలో మొత్తం 26 మందికి ఉద్యోగాలు వచ్చాయి. అందులో ఎస్జీటీ 17 మంది, స్కూల్ అసిస్టెంట్‌కు 9 మంది ఎంపికయ్యారు.



బీసీ స్టడీ సర్కిల్ హాలులో చదువుకుంటున్న యువతులు

కన్నవారి కల నెరవేర్చారు



ఆదిలాబాద్ పట్టణంలోని భాగ్యనగర్‌లో స్థిరపడ్డ బత్తుల సత్యనారాయణ, సునీతల పెద్ద కూతురు సృష్టి. భీంసరి గ్రామంలోని ఎకరం పొలంలో తల్లిదండ్రులు కష్టపడి ఇద్దరు కూతుళ్లను చదివించారు. సృష్టి బీసీ స్టడీ సర్కిల్‌లో చేరి ఆన్‌లైన్ యాప్‌తో ఉద్యోగ సాధనకు విలువైన చిట్కాలు తెలుసుకున్నారు. ఎస్జీటీగా ఎంపికై తల్లిదండ్రుల కల నెరవేర్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 83418 12400
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:
? పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు ఆశోకాలనీలో రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - టి. రాజయ్య, అశోక్‌కాలనీ, కాగజ్‌నగర్

✔ ఈఎస్ఐ మూలమలుపు వద్ద పైపులైన్ మరమ్మతుల కారణంగా పలు వార్డులకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు చేపట్టి సోమవారం పలు వార్డులకు నీటి సరఫరా పునరుద్ధరించాం. మిగతా వార్డులకు సైతం నీటి సరఫరా యథావిధిగా జరుగుతుంది. - పెద్దింటి క్రాంతి, మేనేజర్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ

సిర్పూర్(టి), న్యూస్‌టుడే:
? సిర్పూర్(టి)-గంగాపూగూడ కాలనీకి వెళ్లే మార్గంలో రైల్వేస్టేషన్ మూల మలుపు వద్ద నుంచి గంగాపూగూడ వరకు రోడ్డు గుంతలు పడి ఉంది. దీంతోపాటు ఈ మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. సమస్య పరిష్కరించాలి. - దోని హరీష్, సిర్పూర్(టి)

✔ ఈ మార్గంలో రెండు నెలల కిందట విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయించాం. చెడిపోయిన దీపాల స్థానంలో రెండు రోజుల్లో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రోడ్డు మరమ్మతులు చేయిస్తాం. - ఎస్.తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, సిర్పూర్(టి)

ప్రారంభించి.. పుస్తక పఠనం చేయించి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: మండలంలోని తుంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన మోడల్ గ్రంథాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథల పుస్తకాలను అందజేసి వారితో పుస్తక పఠనం చేయించారు. ఉపాధ్యాయుడు శంకర్‌తో పఠన కృత్యాలు చేయించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో 500ల కథల పుస్తకాలు, అధ్యయన సామగ్రి ఉన్నందున విద్యార్థుల పఠనాసక్తిని పెంచేందుకు ఉపయోగించాలని ఈ సందర్భంగా అదనపు పాలనాధికారి ఉపాధ్యాయులకు సూచించారు. ఏఎంవో శ్రీనివాస్, ఎంఈవో ఎం. ఉదయ్‌బాబు, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయుడు సుభాష్, రూమ్ టు రీడ్ సంస్థ రాష్ట్ర మేనేజర్ నర్సింహాచారి, ప్రోగ్రాం ఆఫీసర్ నితిన్, జిల్లా ఇన్‌ఛార్జి జెన్నిఫర్ రాణి, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కథల పుస్తకాలు అందిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, చిత్రంలో అధికారులు, రూమ్ టు రీడ్ సంస్థ ప్రతినిధులు

ఉపాధ్యాయుడి చేరిక.. చదువులు మొదలిక

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలోని తుంగెడ గ్రామ పంచాయతీ పరిధి కొత్తగూడ(టి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి మెర్కొ వెంకటేశ్వర్ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్ల కిందట ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి మూసివేసి ఉందన్నారు. ఇక్కడి విద్యార్థులు గూడెం పాఠశాలలో బోధన కొనసాగించారన్నారు. ఇటీవల నూతన ఉపాధ్యాయుడి నియామకం కావడంతో ఈమేరకు బడిని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 15 మంది విద్యార్థులతో ప్రాథమిక పాఠశాల కొనసాగుతోందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వినయ్‌కుమార్, సత్తయ్య, నాయకులు సౌందర్య, సాయికృష్ణ, తిరుపతి, ఆనంద్, సంతోష్, విలాస్, వెంకటేష్, ఉపాధ్యాయులు లింగయ్య, వనిత, నగేష్ పాల్గొన్నారు.


పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్



రక్తదానానికి ముందుకొచ్చిన మహిళలు

లింగాపూర్, న్యూస్‌టుడే: రక్తదానం చేయడం సామాజిక బాధ్యత అని జైనూర్ సీఐ రమేష్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని పోలీస్ స్టేషన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలానికి చెందిన 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఇద్దరు గిరిజన మహిళలు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. మారుమూల గిరిజన ప్రాంతంలో మహిళలు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. లింగాపూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం కుమురం భీం ప్రాజెక్టు వద్ద లేక్ వ్యూ రెస్టారెంట్‌ను నిర్వహించేందుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ లేదా డిప్లొమా అర్హతతో ప్రముఖ రెస్టారెంట్లలో వంట మనిషిగా పనిచేసిన అనుభవం ఉండి ఆసక్తి గల 18-35 ఏళ్ల వయసున్న వారు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఆసక్తి, అర్హత గల గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు గడువులోగా ఉట్నూరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన శిక్షణ ఉపాధి కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు చరవాణి నం. 94935 35052, 96667 48105 సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

లింగాపూర్, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువతి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్ గుంనూర్ గ్రామానికి చెందిన పుసం శారద(20) ఆదివారం సాయంత్రం పురుగుమందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జూదరులపై కేసు నమోదు

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని సరండి గ్రామ శివారులో జూద స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఆయిదుగురు జూదం ఆడుతుండగా వారిలో ఒకరు పరారయ్యారు. నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయిదుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. జూదం, మట్కా ఆడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

స్వాధీనం చేసుకున్న ఇసుకకు వేలం

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: సిర్పూర్(టి) మండలంలోని మాకిడి గ్రామ శివారులో గత వారం అక్రమంగా నిల్వ ఉంచిన 150-200 ట్రాక్టర్ల లోడు ఇసుకను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఈమేరకు స్వాధీనం చేసుకున్న ఇసుకను బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 24న రూ.5,000 దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.


జిల్లా ఇన్‌ఛార్జి డీఈఓ ఉదయ్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలు

బిల్లులు చెల్లించకపోతే మధ్యాహ్న భోజనం నిలిపేస్తాం

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : తిర్యాణి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు అల్పాహార బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం సంబంధిత కార్మికులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఇన్‌ఛార్జి విద్యాధికారి ఎం. ఉదయ్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. కార్మిక సంఘ మండల అధ్యక్షురాలు మడావి చంద్రకళ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించని పక్షంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటను నిలిపివేస్తామని హెచ్చరించారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ప్రతి నెలా మొదటి వారంలోనే బిల్లులు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భీం ఆశయ సాధనకు కృషిచేద్దాం

కెరమెరి, న్యూస్‌టుడే : పోరాట యోధుడు కుమురం భీం ఆశయాలను నెరవేరుద్దామని మాజీ ఎంపీపీ పెందుర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు సెడ్మాకి ద్రుపదబాయి పిలుపునిచ్చారు. భీం వర్ధంతి వారోత్సవాలలో భాగంగా.. సోమవారం మండలంలోని సాకడ చౌరస్తాలోని భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి, ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, నాయకులు పెందుర్ ఆనంద్‌రావ్, జలపతిరావ్, దంబిరావ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఇటీవలి బదిలీల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన సీఐ బండారి సంపత్ సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావును కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. సంపత్ ఇదివరకు భూపాలపల్లి జిల్లాలో సైబర్ క్రైం విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

సమస్యలు విని.. పరిష్కారానికి ఆదేశించి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు తన కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలను చట్టప్రకారం సత్వర పరిష్కారం చూపాలని జిల్లాలోని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా సంప్రదించి పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు. పోలీసులు ప్రజలతో స్నేహభావంతో మెదులుతూ వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు భరోసాగా శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలనుంచి స్పందన రావడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.


దరఖాస్తు పరిశీలిస్తున్న ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు

25న జాబ్ మేళా

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 25న నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన అధికారి సతీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ గ్రూప్ హైదరాబాద్‌లో పనిచేయడానికి 200మంది లేడీ గార్డ్స్, మేల్ గార్డ్స్, సూపర్‌వైజర్లు, రిసెప్షనిస్టుల పోస్టులను భర్తీ చేసేందుకు మేళాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హతలతో 18-30 వయసుతో ఆసక్తి గల అభ్యర్థులు శుక్రవారం ఉదయం 11 గంటలకు జిల్లాలోని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు చరవాణి నం. 95504 41888, 91606 08476 సంప్రదించాలని తెలిపారు.

గిరిజనులకు రగ్గులు.. యువకులకు కిట్లు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని కొన్ని అసాంఘిక శక్తులు పెడదారి పట్టించే ప్రమాదం ఉన్నందున వీటికి దూరంగా ఉండాలని కాగజ్‌నగర్ గ్రామీణ సీఐ శ్రీనివాస్‌రావు సూచించారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని సోమవారం రాత్రి రేగులగూడలోని గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరకులు, రగ్గులు పంపిణీ చేశారు. గుడుంబా తయారీ, గంజాయి సాగుకు దూరంగా ఉండాలన్నారు. ఎస్సై మహేందర్, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


గిరిజనులకు రగ్గులు అందజేస్తున్న సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై మహేందర్

కౌటాలలో..

కౌటాల: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా.. సోమవారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎస్సై మధుకర్ వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కళాశాల నుంచి పోలీస్‌స్టేషన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలసి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.


విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎస్సై మధుకర్


ధ్రువపత్రాలు అందజేస్తున్న జీఎం శ్రీనివాస్, సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి

శిక్షణతో స్వయం ఉపాధికి అవకాశం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత వృత్తి శిక్షణ కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ ఆకాంక్షించారు. సోమవారం గోలేటి సీఈఆర్ క్లబ్‌లో వృత్తి శిక్షణ కోర్సుల ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2022, 2023, 2024లలో శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. 2002 నుంచి సంస్థ మహిళలకు ఉచితంగా వృత్తి శిక్షణ కోర్సులను అందిస్తోందన్నారు. ఎంతో మంది నిరుద్యోగ యువతతో పాటు బ్యూటీషియన్, ఫ్యాషన్, డిజైనింగ్, టైలరింగ్, మోటర్ డ్రైవింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి కోర్సులను సద్వినియోగం చేసుకుంటూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు. త్వరలో మరిన్ని కోర్సులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషశయనరావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సేవా సమితి సభ్యులు ఎస్. లక్ష్మి, కుందారపు శంకరమ్మ, కోమల, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

వేతనాలు అమలు చేయాలని వినతి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే : బెల్లంపల్లి ఏరియా ఖైరిగూర ఓసీపీలో పని చేస్తున్న బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు కోరారు. ఈమేరకు సోమవారం కాంట్రాక్టు కార్మికులతో కలిసి జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా బ్లాస్టింగ్ పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. 2022 సెప్టెంబరు 26న కాంట్రాక్టు కార్మికుల జేఏసీతో జరిగిన ఒప్పందంలో బ్లాస్టింగ్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించేందుకు అంగీకరించారని, రెండేళ్లు అయినా అమలు చేయడం లేదని ఆరోపించారు. వీరికి తెబొగకాసం బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాస్‌రావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు కొమురయ్య, ఇస్తారి, రవి, వెంకటేష్, పర్వతాలు పాల్గొన్నారు.

'హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం'

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని భారాస మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్ ఆరోపించారు. వ్యవసాయ శాఖ మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా ఇవ్వలేమని చెప్పిన మంత్రి వ్యాఖ్యలను ఖండించారు. రైతు భరోసా ఎగ్గొట్టిన సీఎం రేవంత్ రెడ్డి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, రైతులకు వెంటనే రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవాజీ, గంగారాం, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట సతీష్, తదితరులు పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్‌లో నిరసన తెలుపుతున్న భారాస నాయకులు

సిర్పూర్(టి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై, పార్టీ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై పోలీసుల తీరుకు నిరసనగా.. మండలంలోని బస్టాండ్ చౌరస్తాలో భారాస నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో స్థాయికి మించిన హామీలు ఇచ్చిందని విమర్శించారు. వెంటనే రైతుభరోసాతో పాటు రుణమాఫీని అమలు చేయాలని డిమాండ చేశారు. పార్టీ మండల కన్వీనర్ అస్లం బిన్ అబ్దుల్లా, కో-కన్వీనర్ లక్ష్మణ్, నందాజీ, షేక్‌చంద్ తదితరులున్నారు.


సిర్పూర్(టి) బస్టాండ్ వద్ద ధర్నా

ఘనంగా నరేంద్రబాబా జన్మదిన వేడుకలు

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే: మహారాష్ట్రకు చెందిన నరేంద్రబాబా జన్మదినం పురస్కరించుకుని మండలంలోని బాబాసాగర్ గ్రామంలోని భక్తులు సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా.. భక్తులు పెద్ద ఎత్తున హనుమాన్ ఆలయానికి చేరుకొని బాబా చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి బాజాభజంత్రీలతో మహిళల బోనాలతో ఊరేగింపుగా నృత్యం చేస్తూ కాలనీల గుండా ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ ఆలయం వద్ద భజన, ఇతర కార్యక్రమాలు జరిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కౌటాల: మండలంలోని వీర్దండి, గుండాయిపేట గ్రామాల్లో నరేంద్ర బాబా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో పల్లకీ ఊరేగింపు కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.


బాబాసాగర్ గ్రామంలో భక్తుల ర్యాలీ


కౌటాలలో.. పల్లకీ ఊరేగింపు

వినతులు

పీఎఫ్ బకాయిలు చెల్లించాలని..

ఆసిఫాబాద్ అర్బన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి బకాయి పడ్డ రూ.2 కోట్ల పీఎఫ్, ఈఎస్ఐలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం అదనపు పాలనాధికారి దీపక్ తివారీకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ మాట్లాడుతూ పీఎఫ్ బకాయిలతో పాటు పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరారు. కార్మిక సంఘ అధ్యక్షుడు శంకర్, నాయకులు మల్లేష్, రమేశ్, భూమయ్య, అశోక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబం తరఫున..

కౌటాల: మండలంలోని సిర్సా గ్రామానికి చెందిన జడ భీమయ్యకు చెందిన 180 జీవాలు రైలు ఢీకొనడంతో మృత్యువాత పడిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ.. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉప తహసీల్దార్ మష్కూర్ అలీకి వినతిపత్రం అందజేశారు. గొర్రెలు కాస్తూ సంచార జీవనం గడుపుతున్న భీమయ్య కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కడారి భీమయ్య, శ్రీశైలం, పోచయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్రంగి కార్మికులపై వేధింపులు ఆపండి

ఆసిఫాబాద్ అర్బన్: వడ్రంగి కార్మికులపై అటవీ అధికారుల వేధింపులు అరికట్టాలని కోరుతూ.. సంబంధిత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. వడ్రంగి వృత్తిని నమ్ముకొని తరతరాలుగా జీవిస్తున్న వారిని ఇటీవల అటవీశాఖ వారు వేధింపులకు గురి చేస్తున్నారని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమాచారి సందర్భంగా ఆరోపించారు. ప్రభుత్వం ఈ వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. వీరికి వృత్తి రక్షణ కల్పించాలని కోరారు. కార్మికులు తులసీరాం, పద్మాకర్, వెంకటేశ్, రాజయ్య, రాజేశం, నాగేష్, ప్రభాకర్, రాజు బబన్, హన్మంతు కిశోర్‌లు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే

ఆసిఫాబాద్ అర్బన్: ఆసిఫాబాద్ పట్టణం మజీద్‌వాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయుడు జాదవ్ గోవిందరావుపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. సోమవారం బాధితుడితోపాటు ఉపాధ్యాయ సంఘాల సభ్యులు అదనపు పాలనాధికారి దీపక్ తివారీకి వినతిపత్రం సమర్పించారు. నాయకులు జాదవ్ కిరణ్‌కుమార్, సంజయ్, హేమంత్ షిండే, తుకారాం, రమేశ్, రవీందర్, రాథోడ్ ప్రకాష్, ఎల్. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా నిబంధనలు పాటించేలా చూడాలి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : సిర్పూర్ పేపర్ మిల్లుకు వచ్చే లారీలు రవాణా నిబంధనలు పాటించేలా చూడాలని కోరుతూ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా రవాణాశాఖ అధికారి రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు. నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, అసోసియేషన్ అధ్యక్షుడు వెన్న కిశోర్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

* లారీ అసోసియేషన్ చేపడుతున్న నిరసనకు సోమవారం ఎంఐఎం మద్దతు తెలిపింది. పార్టీ కాగజ్‌నగర్ పట్టణాధ్యక్షుడు అబ్దుల్ ముబిన్ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం లారీ అసోసియేషన్ నిరసన తెలుపుతోందని, ఎస్పీఎం యాజమాన్యం, రవాణా శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. స్థానికంగా అర్హులైన అనేక మంది యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, మిల్లులో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని పేర్కొన్నారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జావిద్ మల్నాస్, ఎంఏ అబిద్, ఎండీ నియాజ్, సయ్యద్ సాధిక్, ఎండీ అఫ్జల్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎంఐఎం కాగజ్‌నగర్ పట్టణాధ్యక్షుడు అబ్దుల్ ముబిన్

కోతకు గురై.. గోస మిగిలే!

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: మండలంలో రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల వాగులపై తాత్కాలికంగా వేసిన మట్టిదారులు కోతకు గురయ్యాయి. ప్రజల రాకపోకలు ఇబ్బందిగా మారింది. గుండి వాగుపై మాజీ సర్పంచి రవీందర్ రెండు రోజుల కిందట పైపులు వేసి పైన మట్టితో తాత్కాలిక దారి నిర్మించారు. వర్షంతో కొట్టుకుపోయింది. చోర్‌పల్లి పంచాయతీ పరిధిలోని నందూప వాగుపై గ్రామస్థులు 15 రోజుల కిందట పైపులు, మట్టి వేసి తాత్కాలికంగా రోడ్డు నిర్మించారు. వర్షంతో ఇది కూడా కొట్టుకుపోయింది. దాని అవతలే రైతుల పంట చేలు ఉండటంతో వెళ్లేందుకు ఆటంకం ఏర్పడింది. వాంకిడి మండలం ఖమానా నుంచి కాగజ్‌నగర్ వెళ్లేందుకు ఈ మార్గాన్నే ఆశ్రయిస్తుంటారు. కోతకు గురవడంతో కాగజ్‌నగర్‌కు జిల్లా కేంద్రం మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.


తెగిన నందూప వాగుపై నిర్మించిన మట్టి రోడ్డు

మూడు రోజులపాటు సీపీఎం మహాసభలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ పట్టణంలో నవంబరు 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా మూడో మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, భూపాల్ హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలోని ప్రజా సమస్యలపై పోరాటాలకు ప్రణాళికలు రూపొందిస్తారని పేర్కొన్నారు. అడ ప్రాజెక్టు కాలువలు పూర్తి చేసి రైతులకు నీరందించాలని, జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో ప్రొఫెసర్లు, డాక్టర్లు ఇతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉండేలా అధికార యంత్రాంగం పనిచేయాలని చెప్పారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను మానుకోవాలన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, గొడిసెల కార్తీక్, రాజేందర్, శ్రీనివాస్, బక్కన్న తదితరులున్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.భాస్కర్

రైతులకు అందుబాటులో శనగ విత్తనాలు

కౌటాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని గురుడుపేట సహకార సంఘం కార్యాలయంలో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు డీసీఎంఎస్ వైస్ ఛైర్మన్ కుమురం మాంతయ్య తెలిపారు. సోమవారం శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 25 కిలోల బస్తాకు రూ. 2250లు చెల్లించి కొనుగోలు చేయాల్సిందిగా ఆయన రైతులకు సూచించారు. సీఈఓ రాజేష్, ఏఈఓ ఘన్‌శ్యామ్, రైతులు పాల్గొన్నారు.